# మహామాయావిలాస్

డా.మంతెన సూర్యనారాయణరాజు

ఆమెది ఊరు కాదు. మనిషిని చూస్తే బాగా బతికిన పుణ్యస్త్రీలాగుంది. ముఖాన రూపాయి బిళ్లంత కుంకుమ బొట్టు. తీర్చిదిద్దినట్లుండే కట్టు. రకరకాల చిలకలపూడి రోల్డుగోల్డు నగలు మెడలో అలంకరించుకుంది. వయస్సుకూడా ముప్పై ఆరు పై చిలుకే ఉంటుంది. అక్కడక్కడ వెండి తీగల్లాంటి తెల్లగా మెరుస్తున్న వెంట్రుకలు. పెద్దింటి ముత్తైదువ అనడానికెంతో ఆస్కారముంది. 'ఎడ్డాది వీధి' అనే బోర్డున్న వీధిలో మొదటి ఇంటికెళ్లింది. ఆ ఇంటిలో అందరు ఆమెను సాదరంగా లోనికి ఆహ్వానించారు. అందరికీ నమస్కరిస్తూ ముందు తనను తాను పరిచయం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో "నా పేరు మహారాణి. మా పుట్టిల్లు విజయనగరమే! మీ ఇంటికిగాని మాయాదేవిగానొచ్చిందా! వస్తే, దయచేసి ఒక్కసారి చెప్పండి. ఆమె ఎక్కడికెళ్తానని చెప్పింది. ఇక్కడికొచ్చి ఎన్నాళ్లయింది. అటువంటి మహాతల్లి చేతి తాయత్తు కడితే చచ్చిన శవం కూడా లేచి కూర్చుంటుంది" అంటూ ఆమె రూపాన్నికూడా వర్ణిస్తూ, ఉన్నవీ లేనివీ ఎన్నో మహిమలు ఏకరువు పెట్టింది.

మహారాణి చెప్పింది అంతా విన్నాక ఆ ఇంటి యజమాని సింహాచలం తన భార్యతో ఆమెకేదైనా తెచ్చి ఇమ్మన్నట్టు కనుసైగ చేసాడు. ఆమె లేవబోతూంటే సింహాచలం కూర్చోండి అని చెప్పాడు. మహారాణి ఎంతో అందంగా తిరిగి కుర్చీలో కూర్చుండిపోయింది. "ఇంతకీ ఎవులండావిడ? మాయాదేవా! ఏం పేస్తుంటది? ఎక్కడుంటుంది" అన్నాడు సింహాచలం. ఈలోగా ఇంటి యజమానురాలు చల్లని మజ్జిగ దాహం తెచ్చి ఆమెకిచ్చింది. దాహం తాగాక "ఇందాక చెప్పాను గదండీ! ఊరంటూరా ఆవిడకొక్క ఊరేటి? అన్నూర్లూ తనవే! అంటూ ఆగిపోయింది. భర్త వైపు చూస్తూ ఆ యజమానురాలు "బజారెల్లొస్తానన్నారు ఎల్లరా" అంటూ అడిగింది.

సింహాచలం భార్యను ముందు వరండాలోకి పిల్చి నెమ్మదిగా "ఆవిడెవరో ఏటో వివరాలు తెలుసుకో! అంతేగాని పగలు సూసి రేత్తిరి కన్నానికొచ్చేవోల్లు ఈరోజుల్లో ఎక్కువైపోనారు. అందులో ఆడా, మగా ఎవులైనా ఒకటే! జాగర్త!" అంటూ టవల్ భుజాన వేసుకుని వీధి గుమ్మం దాటి బైటికెళ్లిపోయాడు. ఏటో ఈ మడిసికన్నీ అనుమానాలే! ఆమెను సూత్తే నాకెంతో ఆత్మీయురాల్లా సూపిత్తున్నాది. దొంగనా కూతుర్లా అనిపించట్లేదు. ఎవలో మాయమంత్రాలున్నావిడగావోల్ను. ఆ యవారమే ఇక్కడికి తీసుకొచ్చి ఉంటుంది అనుకుంది. లోపలికి వస్తూనే అమ్మె "రాణీగారూ! ఆ మాయాదేవితో పాపం ఎంతవసరం పడినాదో వత్తే పంపిత్తాలెండి. ఈలోగా మీకు దొరికితే పని చక్కబెట్టుకోండి" అంది.

"ఈ అమ్మాయిలిద్దరూ మీ పిల్లలండి" అంటూ మహారాణి యజమానురాలిని ఆసక్తిగా అడిగింది.

"అవునమ్మా! ఇద్దరూ నాకూ తనకీ రెండు కళ్ళు. ఆ...! నా పేరు చెప్పలేదు, మీకు, కనకసుందరి, మా పెద్దపిల్ల పేరు ఉషాచంద్ర, చిన్నపిల్ల పేరు భానుచంద్ర" అంది ఆ వయసొచ్చిన ఆడపిల్లలిద్దరూ "నమస్తే! ఆంటీ!" అంటూ వినయంగా రాణికి నమస్కరించారు. "చిరాయువులై వర్ధిల్లండి ఇద్దరూను. అన్నట్టు కనక సుందరిగారూ! నేను ఇందాక చెప్పినావిడ అదేనండి మాయాదేవి. అదివరకి మా అమ్మాయికి ఒకసారి అమ్మవారు పోస్తే తాయెత్తు కట్టిందంతే! అప్పట్నుంచి మా పిల్ల మళ్ళీ ఏ జబ్బూ ఎరగదు. మా చెల్లెలుగారమ్మాయికీ మధ్య గాలిదోషం పట్టుకుని నిద్రలో నడవటం, మాట్లాడటం వంటి పనులు చేస్తోంది. మీకు పుణ్యముంటుంది. ఆమెగానిటొస్తే నాకు ఆచూకీ తెలుపుతూ ఒక ఉత్తరం ముక్క రాద్దురూ! ఈ జన్మలో మీ మేలు మర్చిపోను" అంది మహారాణి లేచిపోతూ.

"దానికేం భాగ్యం! ఆవిడంత శక్తి సంపన్నురాలా? నిజంగా!" అంటూ అయోమయంగా అడిగింది కనకసుందరి.

"భలేవారే! ఆమెది సామాన్యమైన శక్తికాదు. చేతిలో పసరు వేస్తే చేతబడి గుణమున్నా అది కాస్తా విరిగిపోతుంది. విభూది మంత్రించి ఇస్తే ఇక తిరుగులేని దెయ్యమైనా తగ్గి ఊరుకోవాలి. క్రితం సారి వచ్చినప్పుడు ఏభై చేతిలో పెట్టి పంపాను. అప్పుడే ఆర్నెల్లవుతుంది. ఆవిడ్ని చూసి. అంతెందుకు. నాది మట్టి బుర్ర కాకపోతే ఎడ్రసన్నా తెలుసుకోకుండా ఉంటానా చెప్పండి. మీకు శ్రమిచ్చాను" అంటూ గడపవైపు నాలుగు అడుగులు వేసింది.

కనకసుందరి ఆమెని ఆగమని చెప్పి కుంకుమ బొట్టు పెట్టింది. మహారాణికూడా కనకానికి అందులో కుంకుమతో బొట్టు పెట్టింది. గడప దాటి కొంతదూరం దాకా ఆమెను కనకసుందరి సాగనంపుతూ "తప్పకుండా ఆవిడొస్తే మీ దగ్గరకు పంపిస్తా! అయ్యో నా మతిమండినట్టుందే! ఇంతకీ మీ అడ్రసు చెప్పారు కాదే!" అంటూ అయోమయంగా అడిగింది. "నా అడ్రసుదేముంది. పి.మహారాణి. అయ్యకోనేరు గట్టుకెదురుగా, విజయనగరం అంటే చాలు. మర్చిపోకండే ఉత్తరం రాయడం" అంటూ వీధి మలుపు తిరిగి వెళ్లిపోయింది.

సాయంకాలం దాకా సింహాచలం ఇంట్లో చెప్పినట్టుగానే ఊరంతా చెప్పకొచ్చింది మహారాణి. ఆడవాళ్ళందరికీ అసలు ఎవరీ మాయాదేవి. ఆమెను చూసి తీరాలి. కళ్ళను కనిపిస్తే మనం ఆమెతో తమ పిల్లలకు తాయెత్తు కట్టించాలని కొందరు తాడేయిద్దామని కొందరు రకరకాలుగా ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉండిపోయారు. మగణ్ణి లొంగదీసుకోవడానికైనా పనరిస్తుందేమోనని కొందరు ఉబలాటపడిపోయారు. ఎంతిచ్చినా ఆమెకు తప్ప లేదు అనే సదభిప్రాయానికి వచ్చేసారు.

✽✽ ✽✽✽ ✽✽

"అమ్మా! ఓ...లమ్మోయ్! విన్నేవే! తొందరగారా! మొన్న మనింటికొచ్చిన మహారాణిగారు సెప్పినాదే! అదేనే! కోలముఖం, సప్పిడి ముక్కు, గిరజాల జుట్టు, ఎత్తువళ్ళు, నారింజ పండు రంగు చీర్లంటే ఇష్టమన్లే! అవే కడతాదని చెప్పలే! ఆమె కనిపిస్తే ఉత్తరం రాయమన్లే! అచ్చుపోసినట్లు అదే తీరుగున్నామె ఇటొచ్చేత్తున్నాది సూడు. విన్నే!" అంటూ ఉషాచంద్ర వీధి మలుపు తిరిగి తమ ఇంటి వైపే వస్తున్న స్త్రీని చూపుతూ తల్లికి చెప్పింది. కనకసుందరి ఆబగా "అవునే అమ్మా! వస్తోందని ఆ మారాణి గొడవెల్లగున్నా, మీ చెల్లెలు గుంట వారం రోజులుగా మూసిన కన్నెత్తకుండా జ్వరంతో బాధపడుతున్నాది గాదే! టైఫాయిడన్నాడు డాక్టర్ బాబు. ఉండు. ఈవిడతో తాడేయించేత్తే! నయమై పోవచ్చు. ఏటంతవు?" అంటూ కనకం రెండడుగులు వీధిలోకి వేసింది.

ఎదురొస్తున్న స్త్రీ తలవొంచుకుని కావాలనే తన దార్న తాను పోతోంది. కనకసుందరి ఆమెకు అడ్డంగా వెళ్తూ నెమ్మదిగా "ఏవండీ! మిమ్మల్నే! మీ పేరు మాయాదేవి కాదా!" అంటూ ఆసక్తిగా ప్రశ్నించింది.

"ఆ...! నా పేరు మీకెలా తెలుసు. మిమ్మల్ని ఇదివరకు నేనెప్పుడూ చూళ్ళేదే! నాకు పనుంది. అడ్డు తప్పకోండి" అంటూ ముందుకు పోబోయింది.

"మీరలాగంటే ఎలా! మీరు రచ్చరేకలిత్తారట. తాయత్తులు కడ్తారట. ఎన్నని నాను ఇప్పి సెప్పేది. మీ ఋణం వుంచుకోలెండి. ఇంద వంద. నడవండి మా ఇంటికి. మా సిన్నపిల్ల జొరంతో వారం రోజులుగా నెగడం నేదు. మంచం పట్టేసినాది" అంది కన్నీరు గుక్కుకుంటూ.

"మీరు నా ముందరి కాళ్లకు బంధం వేసేశారు. నా గురించి ఎవరు చెప్పారో గాని, ఇట్టే పోల్చే

ళారు. మీరు నిజంగా తెలివైనోళ్ళు. అయినా నేనీ పనులన్నీ చేస్తానని ఎవరు చెప్పారు?" అంది కనకసుందరి ఇంట్లోకి ప్రవేశిస్తూ మాయాదేవి.


"ఏటో! జగమెరిగిన బామ్మనికి జందాలెందుకన్నట్టు మీలాంటి గొప్పోళ్ల గురించి ఒకరు సెప్పాల ఏటి?" అంటూ తన రెండవ కూతురు భానుచంద్ర వున్న గదిలోకి తీసుకుపోయింది.

అరగంట ఆ కబురూ ఈ కబురూ చెప్పి ఉషాచంద్రకు గాలి దోషం సోకకుండా తాడు వేసింది. భానుచంద్రకు గుగ్గిలం పొగేసి తాయెత్తు మంత్రించి ఇచ్చింది. తనకు పని వున్నదన్నట్టు లేచి వెళ్తూ "నేనిటువచ్చినట్టు ఎవరికీ చెప్పకండి. అందరూ నా వెంటబడి మాకంటే మాకని ఈ రక్షరేఖలు, తాయెత్తులూ కట్టమని చంపుకుతింటారు. ఆఖరికి మగాళ్ళకు కూడా చెప్పొద్దు. వస్తానండి. దిగులుపడొద్దు అమ్మాయికి బాగైపోద్ది" అని తన దారిన తాను వెళ్ళిపోయింది మాయాదేవి.

అలా ఊరు ఊరంతా ఒకేలా చెబుతూ సాయంకాలానికి మొత్తం చుట్టేసొచ్చింది. పిచ్చి జనం గొర్రెల్లాంటివాళ్ళు కదా! ఎవరి మటుకు వాళ్లు ఒకళ్ళకు తెలీకుండా ఇంకోళ్ళు తమ తమ నమ్మకాల్ని బట్టి అవి ఇవీ కట్టించుకున్నారు. చీకటి పడుతుండగా ఊర్లో వున్న పెద్ద లాడ్జిలో తాను బస చేసిన రూముకు తిరిగొచ్చింది. అప్పటికే మహారాణి లైట్‌గా రెండు పెగ్గుల విస్కీ తాగి గదిలో పిచ్చికుక్కలా తిరుగుతోంది. మాయాదేవి రవిక లోపల పాకెట్‌లో దాచిన సొమ్ము అంతా గుమ్మరించి బాత్రూమ్ కెళ్లింది. తిరిగి చక్కా వచ్చేటప్పటికి మహారాణి వంద నోట్లని, ఏభై నోట్లని, ఇరవైనోట్లని, పది, ఐదు నోట్లని వేటికవి విడగొడుతూ లెక్కలేస్తోంది. కేలిక్యులేటర్‌లో లెక్కేస్తే లెక్క సరిపోయింది.

మాయాదేవి పలావు పేకెట్లు, చికెన్ పేకెట్లు, ఎగ్ ఫ్రై వాసన చూస్తూ "ప్రాన్ కర్రీ తెప్పించలేదా! లేకపోతే ఫిష్ గాని" అంటూ ఆగిపోయింది. మహారాణి లెక్కించిన సొమ్ము బ్యాగ్‌లో దాచేస్తూ "సిస్టర్! ఒక్క వంద తక్కువగా మూడువేలు. పర్వాలేదు. ఇన్‌కం పెరిగింది. రాగిముక్కలు రక్షరేకులై, వెండిముక్కలు తాయెత్తులై, గుడ్డ పీలికలు, మూలుదారాలు తాళ్లై వపైన పెట్టుబడికి రూపాయి వంతున లాభాలార్జించిపెట్టాయి. రా. తొందరగా! ఆలస్యం చేస్తే అన్నీ చల్లారిపోతాయి. ఆకలి దంచేస్తోంది" అంటూ తన పక్కనున్న పలావు పొట్లం విప్పింది. ఖాళీ గ్లాసులు రెండు, పక్కన ఐస్ జగ్, విస్కీ, బిస్లరీ సోడాలు ముందుకు జరిపింది. చిప్స్ ప్లేట్‌లో పోసింది.

తాగినంత తాగి, తిన్నంత తిన్నాక నిద్రకు ఉపక్రమించబోయే ముందు మాయాదేవి రూమ్ తలుపు తీసింది. ఎదురుగా కౌంటర్ దగ్గర పాత పరిచయమున్న ఎస్‌ఐ విలాస్ సివిల్ డ్రస్‌లో కనిపించాడు.



మాయ అతనిని గుర్తుపట్టి వినిపించేలా "బావా! బాగున్నావా!" అంటూ పలకరించింది. వెంటనే ఎస్‌ఐ విలాస్ ఆమెని గుర్తుపట్టి "హాయ్! దేవీ నువ్వా! ఎక్స్క్యూజ్‌మి" అంటూ ఆమె దగ్గరకొచ్చాడు. మాయని ఎగాదిగా చూస్తూ లొట్టలేస్తూ నెమ్మదిగా "మీ చెల్లెలు మహరాణి కూడా వచ్చిందా! అయితే ఈ రాత్రి నాకు పండుగే!" అంటూ లోపలికి ప్రవేశించాడు. ఆమెను కూడా లోపలికి రమ్మని తలుపు గడియ వేయమని సైగలు చేశాడు.

* * * * * * *

ఇటుపక్కా, అటు పక్కా చెరొకర్నీ పెట్టుకుని వారిమీద చేతులు వేసి నిద్రపోతున్న ఎస్‌ఐ విలాస్‌కి ఒక రాత్రివేళ మెలుకువ వచ్చింది. భార్యాపిల్లలు గుర్తొచ్చారు. వాళ్ళ బ్యాగ్‌లో దొరికిన చిల్లర లుంగచుట్టి లేస్తూ "వస్తాను. మరదళ్ళూ! రేపు ఇక్కడే మీరు వుంటానంటే రేపూ వస్తాను. కాని నాకు రేపు కేంపుంది ఎలా చెప్మా!" ఆవులిస్తూ అన్నాడు.

"చిల్లరంతా పట్టుకుపోతున్నావా బావా! నీ కక్కుర్తి బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. అయినా ఎక్కడికి పోతాయిలే హెడ్డూ, కానిస్టేబులు బుద్ధులు. అందులో వందుంచుకుని మిగిలింది మాకు వదిలేయ్!" అంది మహారాణి.

"వందకేమొస్తుంది నా బొంద. వెయ్యి తీసుంటాను" అన్నాడు.

మాయాదేవి విలాస్‌మీద పడి రక్కుతూ, మదపిచ్చి పట్టిందానిలా మీదపడి కౌగిలించుకుంది. వెంటనే విడిపోతూ సీరియస్‌గా "ఆడదాని సొమ్ము ఇలా స్వాహా చేస్తే నీకు పుట్టగతులుండవ్. కళ్ళు చింతనిప్పల్లా పేలిపోతాయ్" అంది.

"ఆ! తీయ్! పెద్ద దేవుడమ్మవు దిగొచ్చావ్! నీ చమక్కులు జనం దగ్గర. నా దగ్గర మాత్రం కాదు. ఆట్టే నీలిగితే ఇద్దర్నీ సెల్‌లోకి తోయిస్తాను" అంటూ పోబోయాడు. మాయాదేవి చెల్లెలి చెయ్యి గిల్లుతూ "మహారాణీ! బావ మనసు వెన్నపూసే! మళ్ళీ రేపు వస్తానంటున్నాడు. ఇవ్వాళ అందినంతా దోచేసుకున్నాడు" అంటూ లైటువేసి వెళ్ళిరమ్మని సైగచేసింది.

విలాస్ లాడ్జిలోంచి బయటపడి మోటర్ సైకిల్ స్టార్ట్ చేసి వేగంగా ఇంటికి వెళ్ళిపోయాడు. రాత్రి పొందిన సుఖాన్ని గాని, తాను నొల్లుకొచ్చిన ధనాన్ని గాని విలాస్ తిరిగి నెమరేసుకోలేదు. లెక్క పెట్టుకోలేదు. లోకంలో ఆకులు నాకేవాళ్ళు కొందరైతే వాళ్ల మూతులు నాకేవాళ్లు విలాస్‌లాంటివాళ్ళు. ఎలాగైతే నీతిని అతిక్రమించి మహారాణి, మాయాదేవి, విలాస్‌లాంటి వాళ్ళు ప్రపంచమంతా వ్యాపించి, మహా మాయా విలాసాలతో రోజుల్ని ఆనందదాయకంగా గడుపుతూ వుంటే నీతిమంతులు నిక్కష్టంగా బ్రతుకును ఈడ్చుకొస్తున్నారు. సో! అవినీతీ నీకే ఈ జనం బానిసలు. కాకపోతే పోలీసోడి చేతికెళ్ళిన సొమ్ము మాయాదేవి కౌగిలించుకున్నట్టే కౌగిలించుకుని వంద మినహా అంతా తెలివిగా లాగేసుకుంది. ఇద్దరూ దొంగలే. తెలివి ఒకరి సొమ్ము కాదుగా! ❀